ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఓటరు లిస్టులో తప్పులను సవరించండి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 5 : ఇటీవల విడుదల చేసిన ఓటర్ లిస్టులో తప్పుల తడకగా ఉందని, దానిని సవరించాలంటూ మంగళవారం షాద్‌నగర్ ఆర్డీవో సరితకు సీపీఎం నాయకుడు శ్రీనూనాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి ఏ గ్రామానికి చెందిన వారికి ఆ గ్రామాల్లోనే ఓటు హక్కు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, లక్ష్మీరాములు, పద్మారెడ్డి, బాబు పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలను తొలగించాలి

మొక్కలను తొలగించాలని ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, నవంబర్ 5: మండల కేంద్రంలో కోనో కార్పస్ మొక్కలను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎంపీడీవో సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్కలతో ఆరోగ్యానికి హాని కలుగుతుందని, ఈ మొక్కలను పలు దేశాల్లో నిషేధించడం జరిగిందని తెలిపారు. వీటితో శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశమున్నదని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి డివైడర్ మధ్యలో ఉన్న కోనో కార్పస్ మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరినట్లు వారు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో కేఎన్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు యాదయ్య, మండల యువజన నాయకుడు రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

బాలిక మిస్సింగ్ కేసులో

పోలీసుల నిర్లక్ష్యం

సీడీఆర్ రావడానికి సమయం పడుతుందని కాలయాపన

ఆవేదనతో కూతురు కోసం రాణా చుట్టూ ప్రదక్షిణ

మొయినాబాద్, నవంబర్ 5 : మైనర్ బాలిక మిస్సింగ్ కేసులో మొయినాబాద్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అదృశ్యమై ఐదు రోజులు కావస్తున్నా పోలీసులు స్పందించకుండా కేసు నమోదుపై నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలిక తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా సీడీఆర్(ఫోన్ కాల్ డీటైల్ రిపోర్టు)రాలేదంటూ పోలీసులు కాలయాపన చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా మద్దూరు మండలం గద్ప గ్రామానికి చెందిన ఆశప్ప కుటుంబం కొన్నేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. ఆశప్ప మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తన చిన్న కూతురు(17)శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకులలో ఉన్న మాడల్ పాఠశాలలో కొనసాగుతున్న కళాశాలలో ఇంటర్ చదువుతున్నది. దసరా సెలవులకు మొయినాబాద్ వచ్చిన బాలిక బంధువుల పెళ్లి ఉండటంతో ఇక్కడే ఉంది. కాగా, ఈ నెల 1న శుక్రవారం సాయంత్రం బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 2న శనివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని, సీడీఆర్ పెట్టాం... అది రావడానికి నాలుగు రోజులు పడుతుందని చెప్పి పంపిస్తున్నారని బాలిక తండ్రి ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై నయిముద్దీన్‌ను వివరణ కోరగా మైనర్ మిస్సింగైనా, మేజర్ మిస్సింగ్ అయినా సీడీఆర్ వచ్చే వరకు మే ఏం చేయలేమంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు.

ఎన్‌టీఆర్ మాడల్ పాఠశాలలో

స్పోర్ట్స్ మీట్

వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న ఎన్‌టీఆర్ మాడల్ పాఠశాల అండ్ కళాశాలలో రెండు రోజులుగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ జరుగుతున్నది. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

- మొయినాబాద్, నవంబర్ 5

ఘనంగా సదర్ ఉత్సవాలు

మండల పరిధిలోని అప్పోజిగూడ గ్రామంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దున్న పోతులతో చేయించిన విన్యాసాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, నాయకులు జంగయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

- మొయినాబాద్, నవంబర్ 5

అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రూ.8.9కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 5 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి అధిక నిధులు కేటాయించి వార్డులను దశల వారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి చందు, వైస్‌చైర్మన్ జగదీశ్ యాదవ్‌లతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని 2, 6, 9, 10, 12, 14, 20, 21, 22, 24 వార్డుల్లో రూ.8.9కోట్ల నిధులతో సీసీరోడ్లు, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీలు, తాగునీటి సరఫరా పైపులైన్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని భాగ్యనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం అధిక నిధులు కేటాయిస్తానని ఆయన తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి చందు, వైస్‌చైర్మన్ జగదీశ్‌యాదవ్, కమిషనర్ రవీంద్రసాగర్, కౌన్సిలర్లు ఇందిరాల రమేశ్, భాను, మమత, ఆనంద్, సునీత, శంకరయ్య, సుల్తానాభేగం, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గురునాథ్‌రెడ్డి, లక్ష్మయ్య, పాండురంగారెడ్డి, మహేశ్‌గౌడ్, కేవీ రమేశ్ రాజు, రాములు, రమేశ్, రాములు, శశిధరప్ప, కుమారప్ప, రవి, కప్పరి రాజు, మహేశ్, రాజు, యాదయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

తుర్కయాంజాల్, నవంబర్ 5: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ సాగర్ ప్రధాన రహదారి నుంచి హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లే అవుట్ వరకు రూ.2కోట్లతో సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల కోట్లతో నియోజకవర్గంలోని రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీజీఐఐసీ నిధుల ద్వారా రూ.2 కోట్లతో మన్నెగూడలో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్లు మాధవి, మంగమ్మ, రవీందర్ రెడ్డి, తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, డీఈ భిక్షపతి, టీజీఐఐసీ అధికారులు, నాయకులు భీంరెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 5 : ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో డీసీఎంఎస్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు, డీసీఎంఎస్ మేనేజర్ వెంకటరమణారెడ్డి, జిల్లా సహకార సంఘం అధికారి సుధాకర్, ఏడీఏ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్‌చైర్‌పర్సన్ జగదీశ్‌యాదవ్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖ అధికారితో పాటు ఏఈవో శ్రవణ్‌కుమార్, ఆయాశాఖల అధికారులు, రైతుసంఘాల నాయకులు, రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ఎన్యూమరేటర్లకు సర్వే సామగ్రి అందజేస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 5 : కుటుంబసర్వే పకడ్బందీగా చేపట్టాలని కార్యనిర్వాహణాధికారి కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మ, జిల్లా కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నుంచి గ్రామాల్లో కుటుంబసర్వే ప్రారంభిస్తున్నందున మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. పకడ్బందీగా నివేదిక అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్పతినాయక్, ఏఎస్‌వో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి..

మొయినాబాద్ : ఇంటింటికీ తిరిగి కుటుంబ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో 157 మంది ఎన్యూమరేటర్లు, 18 మంది సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని సూచించారు. సమావేశంలో మండల పరషత్ అభివృద్ధి అధికారి సంధ్య, మండల విద్యాధికారి వెంకటయ్య, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఏపీఎం రవీందర్, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి..

చేవెళ్ల రూరల్ : సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నేడు శంకర్‌పల్లి రామంతాపూర్ పరిధిలోని బద్దం మాణిక్యరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు ఎంపీడీవో వెంకయ్య సూచించారు. మంగళవారం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంపీడీవో వెంట తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి కుటుంబ సర్వే

మొయినాబాద్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రేపటి నుంచి నిర్వహిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంధ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయం మరియు కుల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్వేలో 157 మంది ఎన్యూమరేటర్లు, 18 మంది సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు ప్రతి కుటుంబం సహకరించి తమ వివరాలను చెప్పాలని సూచించారు.

సర్వేపై నేడు అవగాహన సదస్సు

షాద్‌నగర్‌టౌన్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై నేడు బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని షాదీఖాన (ఈద్గా)వద్ద ఏర్పాటు చేయనున్న సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షత వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర ఇంటింటి కుంటుంబ సర్వేపై ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

30 వరకు సమగ్ర కుటుంబ సర్వే

చేవెళ్లటౌన్ : ఈ నెల 30వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహిస్తామని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె సమగ్ర సర్వేకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన శిక్షణను రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొత్తూరు, నవంబర్ 5: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కొత్తూరు ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తీగాపూర్ గ్రామానికి చెందిన నలగంటి స్వామి కుటుంబం ఇంటికి తాళం వేసి నాగర్‌కర్నూల్ వెళ్లారు. సోమవారం రాత్రి దొంగలు తాళం పగుల గొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. వీటితో పాటు కొంత నగదును కూడా దొంగిలించారు. బాధితుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడి మృతి

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 5: హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సల్మాన్ అహ్మద్ (27) అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్నాడు. అనాజ్‌పూర్ గ్రామంలోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఎప్పటిలాగే రాత్రి 11 గంటల ప్రాంతంలో బేకరీ మూసివేసి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. రామోజీఫిల్మ్‌సిటీ సమీపంలోకి రాగానే హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వెనుకనుంచి సల్మాన్ అహ్మద్‌ను ఢీకొట్టింది. దీంతో అహ్మద్‌కు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బేకరీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైతుబజార్‌ను అందుబాటులోకి తెస్తాం

చేవెళ్ల, నవంబర్ 5: చేవెళ్ల రైతు బజార్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి అందుబాటులోకి తీసుకువస్తామని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య, వైస్ చైర్మన్ రాములు తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని రైతుబజార్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. రైతులకు అందుబాటులో ఉంటూ మార్కెట్‌లో రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మల్లేశ్, నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

కనుమరుగైన 'కల్యాణలక్ష్మి'

మాడ్గుల, నవంబర్5: మండలంలో సంవత్సరం కిందట పెళ్లిలు చేసుకున్నవారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. వాటికి సంబంధించి అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు చేశారు. కానీ దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ముందుకు కదలడం లేదని, ఆడపిల్ల తలిదండ్రులకు భరోసాగా ఉన్న పథకం నేడు పేదల పాలిటగా శాపంగా మారిందని బాధితులు అంటున్నారు. అధికారులు, ఎమ్మెల్యే చొరవ చూపి చెక్కులు మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఆలయ హుండీల లెక్కింపు

హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కడ్తాల్, నవంబర్ 5: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ దేవత, శివాలయ, రామాలయాలకు సంబంధించిన హుండీల్లోని ఆదాయాన్ని, మంగళవారం ఆలయ శాఖ అధికారులు లెక్కించారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ టి.శేఖర్ సమక్షంలో మైసమ్మతల్లి వారి హుండీలను లెక్కించినట్లు అధికారులు తెలిపారు. 60 రోజులకు సంబంధించి రూ.8,94,822 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ట్రస్ట్ చైర్మన్ శిరోలీపంతూనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ రమావత్ శిరోలీపంతూనాయక్, ఈవో స్నేహలత, ఆలయ నిర్వాహకులు ఆర్పీ భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ సిబ్బంది యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాస్, ఆనంద్, సంతోశ్‌కుమార్‌శర్మ, శ్రీనివాసులు, విజయ్, మహేశ్‌గౌడ్, శ్రవణ్‌కుమార్, పత్యానాయక్, వెంకటేశ్, రవీందర్, బీబీచారి, హర్షవర్ధన్, గోపాల్, హనుమంతు, లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్యులు

మొయినాబాద్, నవంబర్ 5 : పశువులు రోగాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో 261 పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావు, గోరేమియా, గోపాల మిత్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ మండల పరిధిలో..

షాబాద్ : పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ, సంకెపల్లిగూడ, తిమ్మారెడ్డిగూడ, పోతుగల్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, సుధాకర్, బాల్‌రాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాణి, రైతులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న దాస్యతండా నాయకులు

మండల కేంద్రంగా ప్రకటించాలి

కడ్తాల్, నవంబర్ 5: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు ఆందోళనలను ఆపమని జేఏసీ నాయకులు అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో దాస్యతండాకు చెందిన అనిల్, తరుణ్, టీక్యా, లక్యా, భీముడు, శ్రీను, గోపాల, బాలు, హరిలాల్, శంకర్, భక్యా కూర్చున్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు ఆంజనేయులుగౌడ్, మాణిక్యరెడ్డి, బాలయ్య, రాజు, కృష్ణాజీ పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ధర్నా చేస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

ఆదిబట్ల, నవంబర్ 5: ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ట్రేడ్ యూనియన్లను పునరిద్దరిస్తామని, ప్రైవేట్ బస్సులు రద్దు చేసి ఆర్టీసీకి కొత్త బస్సులు కేటాయిస్తామని, కొత్తగా నియామకాలు చేపడుతామని కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పినట్లు పేర్కొన్నారు. ఉచిత బస్సుపాసులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పలువురు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 5 : డీఎస్సీ 2024ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు చేయించారు. మంగళవారం మండల పరిధిలోని రాయపోల్, నాగన్‌పల్లి, బొంగుళూరు, ఉర్దూమీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరిన వారికి సభ్యత్వాన్ని మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రశేఖర్, రవిందర్, చంద్రశేకర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా కోహ్లీ జన్మదిన వేడుక

మండలంలో భారత క్రికెట్ క్రీడాకారుడు విరాట్ కోహ్లీ 36వ జన్మదిన సందర్భంగా మంగళవారం అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలోని కలీం, ప్రవీన్, అరుణ్, రంజిత్, మహేశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

- ఆమనగల్లు, నవంబర్5

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కడ్తాల్, నవంబర్ 5: గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించి సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉన్న మహిళగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఒంటిపై గ్రీన్ కలర్ చీర, ఆరెంజ్ కలర్ జాకెట్ (నెమలి బొమ్మ), ముఖం చుట్టూ గ్రీన్ కలర్ టవల్, బ్లూ, రెడ్, లైట్ గ్రీన్ కలర్ కలిగిన దుప్పటి ఉన్నాయని పేర్కొన్నారు. మహిళ ముఖం గుర్తు పట్టలేనంతగా ఉన్నదని, గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం శవాన్ని ఇక్కడ పడవేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం కోసం 83339 93536, 87125 68298, 94936 28100లో సంప్రదించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

సంఘం భవనానికి స్థలం కేటాయించండి

మంచాల నవంబర్ 5: నాయీ బ్రాహ్మణ సంఘం నూతన భవన నిర్మాణానికి మండల కేంద్రంలో స్థలం కేటాయించాలంటూ మంగళవారం మంచాల తహసీల్దార్ కేవీవీ